

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**హమ్ నే సునాథా ఏక్ హై భారత్**

**సబ్ ముల్కోంసే నేక్ హై భారత్**

**లేకిన్ జబ్ నజ్దీక్ సే దేఖా**

**సోచ్ సమఝ్ కర్ ఠీక్ సే దే ఖా**

**హం నే నక్షే ఔర్ హి పాయే**

**బదలే హువే హువే సబ్ తౌర్ హి పాయే**

**ఏక్ సే ఏక్ బాత్ జూదాహై**

**ధర్మ్ జుదా హై జాత్ జుదా హై**

**అప్ నే జో కుఛ్ హమ్ కో పఢాయా**

**వోతో కహీ భీ నజర్ నా ఆయా...**

ఇప్పుడు ఇలాంటి పాటలు ఎవరూ రాయరు. పాడరు. సినిమాల్లో ఇలాంటి సందర్భాలు కూడా ఉండవు. ఎందుకంటే అప్పటి పాఠశాలలు వేరు. విద్యార్థులు వేరు. గురువులు వేరు. ఇప్పటి స్కూళ్లు వేరు. ఇప్పటి వాతావరణం వేరు. అప్పటి సమాజానికీ, సినిమాలకూ, అప్పటి సామాజిక వాతావరణానికీ ఇప్పటికీ ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తుంది 'దీదీ' సినిమాలో. సాహిర్ లూధియాన్వీ రచించగా 'ఎన్.దత్త' స్వరపరచినదీ అత్యంత ఆలోచనాత్మకమయిన గీతం.

అప్పటికి స్వాతంత్రం వచ్చి ఒక దశాబ్దం దాటింది. 1959 నాటి సినిమా ఇది. విదేశీ బానిసత్వపు సంకెళ్లనుంచి దేశం బయటపడినా ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం సంపూర్ణంగా జాగృతం కాలేదు. బానిసత్వపు మానసిక స్థితి సంపూర్ణంగా తొలగలేదు. పరాయిపాలన సృష్టించిన సమస్యలు దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. వారు సృష్టించిన విద్వేషాగ్నులు దేశంలో రగులుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితిని ఒక్క రోజులో సరిచేయటం వీలు కాదు. ఎంతో సమయం కావాలి. అభివృద్ధి ప్రణాళికలు వేయాలి. అమలు పరచాలి. ఓ వైపు అభివృద్ధి సాధిస్తూ, మరోవైపు సామాజిక, మానసిక, ఆర్థిక, ధార్మిక సమస్యలను పరిష్కరించాలి. ఓ వైపు నిరాశ వాదులు, మరోవైపు ఆశావాదులు, మధ్యలో అమాయక ప్రజలు, భావితరాలు. ఈ పరిస్థితులకు, సందిగ్ధాలకు, అనుమానాలకు, ఆశ నిరాశలకు అద్దం పడుతుంది ఈ పాట.

'దీదీ సినిమాలో సునీల్ దత్ ఆదర్శాలు కల యువకుడు. ఎన్నెన్నో నూతనమైన ఆలోచనలతో సమాజాన్ని అభివృద్ధి వైపు పరుగెత్తించాలన్న పట్టుదల కలవాడు. తన ఆదర్శాలన్నీ అతను విద్యార్థులకు బోధిస్తూంటాడు. ఇతర టీచర్లకు భిన్నంగా ఆటలు పాటలతో పిల్లలకు పాఠాలు నేర్పుతుంటాడు. చెప్పింది వినటం కాకుండా, ప్రశ్నించటం నేర్పుతాడు. ఒకరోజు విద్యార్థులు, అధ్యాపకుడు చెప్పిన విషయాలకూ, తాము నిజజీవితంలో చూస్తున్న వాటికీ నడుమ ఉన్న తేడా గురించి ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్నలకు సమాధానం ఇచ్చి వారి సందేహాలను తీర్చి భవిష్యత్తుపై ఆశాభావం ప్రకటించటం ఈ పాట.

సాహిర్ లూధియాన్వీ స్వయంగా ఆదర్శవాది. కుల మత విభేదాలను ఒప్పుకోడు. కానీ దేశ విభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లాడు. అక్కడ దేశంలోని సంకుచితత్వాన్ని భరించలేక పాకిస్తాన్ వదలి భారత్ వచ్చి స్థిరపడ్డాడు. సాహిర్‌లాగే పాకిస్తాన్ వెళ్లిన మరో రచయిత సాదత్ హసన్ మంటో పాకిస్తాన్‌లోనే స్థిరపడ్డాడు. చివరికి దుర్భర దారిద్ర్యంలో దిక్కులేని మరణం అనుభవించాడు. మన దేశంలో సాహిర్ గొప్ప కవిగా, గేయ రచయితగా మన్ననలందుకుంటున్నాడీనాటికీ.

పాటలో పిల్లలు ఉపాధ్యాయుడిని ప్రశ్నిస్తున్నారు.

'అన్ని దేశాలలోనే ఉత్తమమైనది భారత్ అనీ, ఐకమత్యంతో ఉండే దేశం అనీ విన్నాము. కానీ పరిశీలించి చూస్తే, అర్థం చేసుకుంటే మేము విన్నదానికీ భిన్నంగా ఉంది ఈ దేశం. మేము విన్నదానికీ చూస్తున్న దానికీ పోలిక లేదు. దేశంలో ఐక్యత అన్నదే కనిపించటంలేదు. కులం, జాతి, మతం వంటి విభేదాలు అడుగడుగునా కనిపిస్తున్నాయి. మేము విన్నది, చదివిందీ ఎక్కడా కనిపించటంలేదు.' పిల్లలు తాము చూసిన వాటి గురించి మాట్లాడుతున్నారు. మన దేశం

గొప్పది , భిన్నత్వంలో ఏకత్వం, వసుధైక కుటుంబంలాంటి అనేక విషయాలను వింటున్నాం. కానీ ఇది ఆచరణలో కనబడదు. ఉద్యమాలు, దొమ్మీలు, మత కల్లోలాలు... కుల పోరాటాలు, ప్రాంతీయ పోరాటాలు.. ఇలా దేశంలో ఎక్కడ చూసినా ద్వేషాలు, భేదభావాలు, విభజన వాదాలు కనిపిస్తున్నాయి. దీనికి గురువు సమాధానం ఇస్తాడు. సాహిర్ ఆలోచనలను ప్రకటిస్తాడు.

**జో కుఛ్ మైనే తుం కో పఢాయా**

**ఉస్మే కుఛ్ భీ ఝూట్ నహీ**

**భాషా సే భాషా న మిలేతో**

**ఇస్కా మత్లబ్ ఫూట్ నహీ**

**ఏక్ డాలీ పర్ రహకర్ జైసా**

**ఫూల్ జుదా హై, పాత్ జుదా**

**బురా నహీ గర్ యూహీ వతన్ మే**

**ధర్మ జుదా హో జాత్ జుదా**

**అప్నీ వతన్ మే**

**వహీ హై జబ్ కురాన్ కా కహనా హై**

**జో హై వేద్ పురాణోంకా కహెనా హై**

**ఫిర్ యే షోర్ శరాబాక్యోం హై**

**ఇత్నా ఖూన్ ఖరాబా క్యో హై**

**ఆప్ నే వతన్ మే**

మీకు నేర్పిన దానిలో అబద్ధ ఏమీలేదు. భాషలు వేరు వేరైతే అది విభేదం కావాల్సిన అవసరం లేదు. ఒకే కొమ్మ పైనే ఉండి కూడా పూలు వేరు, ఆకులు వేరు కదా! అలాగే భాషలు వేరైనా అవి ఒకే దేశానికి చెందాలి. ఒకే దేశంలో వేర్వేరు ధర్మాలకు చెందినవారు, జాతులకు చెందినవారు ఉండటంలో పొరపాటులేదు. ఇదే ఖురాన్ చెప్తుంది. ఇదే వేదపురాణాలు చెప్పాయి. అయినా ఎందుకింత గోల? ఎందుకీ హింస, రక్తపాతాలు మన దేశంలో?'

ఇది ఉపాధ్యాయుడి జవాబు. భాషలు, ధర్మాలు, మతాలు, జాతులు ప్రాంతాలు వేర్వేరయినా ఒక దేశం ప్రజలంతా కలసి ఉండవచ్చు. అన్ని మతాలు చెప్పేది 'శాంతి' అయినప్పుడు ఈ ద్వేషాలు, పోరాటాలు హింసలు ఎందుకున్నాయి? అని అడుగుతున్నాడు. సాహిర్, అదృష్టవంతుడు. దేశంలో భాషాపరంగా, ప్రాంతీయ, మత, జాతి ప్రాతిపదికలగా హింసలు చెలరేగినా ఆకాలం నాటి నాయకులకు ప్రజలపై ఉన్న పట్టు వల్ల అవి విద్వేషాగ్నులలాగా చెలరేగి మారణ హోమం జరపటం అతని జీవితకాలంలో చెలరేగటం చూడలేదు. 1959 కాబట్టి, దేశ విభజన జ్ఞాపకాలు తాజాగా ఉన్నాయి కాబట్టి ఈ పరమత సహనం, ఐకమత్యం సాధించగలం భవిష్యత్తులో అన్న ధీమా కనిపిస్తుంది ఈ పాటలో.

**సది యొంతక్ ఇస్ దేశ్ మే బచ్చోం,**

**థీ హుకూమత్ గైరోం కీ**

**అభీ తలక్ హం సబ్‌కె ముహ్ పర్**

**ధూల్ హై ఉన్‌కీ జోడోం కీ**

**లడ్‌వావో ఔర్ రాజ్ కరో'యే ఉన్‌లోగోంకీ హిక్ మత్ థీ**

**ఉన్ లోగోంకీ చాల్ మె ఆనా**

**హం లోగోంకీ జిల్లత్ థీ**

**యే జో బైర్ హై ఏక్ దూజేసే యే జో ఫూట్ ఔర్ రంజిష్ హై**

**ఉన్ హీ విదేశీ ఆకావోంకీ**

**సో చీ సమఝీ బక్షీస్ హై**

**అప్ నే వతన్ మే**

అనేక కాలం మన దేశంపై పరాయి వాళ్ల అధికారం ఉండేది. మన ముఖాలపై వారి కాళ్ల దుమ్ము ఉండేది. వారు మన మధ్య చిచ్చుపెట్టి రాజ్యం చేశారు. 'విభజించి పాలించు' వారి సూత్రం. వారి మోసపు మాటలలో మన దౌర్భాగ్యం కొద్దీ మనం పడిపోయాము. మన నడుమ ఉన్న విద్వేషాలు, ఒకరిపై ఒకరికి అనుమానాలు, అణచివేతల గాధలు ఇవన్నీ ఈ విదేశీ శక్తులు కావాలని పద్ధతి ప్రకారం మనకు ఇచ్చి పోయినవి. దేశ విభజన మత ప్రాతిపదికన జరిగింది. పాకిస్తాన్ ఏర్పడింది. పాకిస్తాన్ వారు తాము వేరు, భారత్ వేరు అని నమ్మేవారు. కానీ భారతీయులు మాత్రం తమంతా సోదరులం తమ నడుమ ద్వేష భావనల బీజాలు నాటి మహా విషవృక్షాలుగా ఎదిగేట్టు చేసింది బ్రిటీష్ వారు అని నమ్మారు. ఐక్య భారత్‌ను పాలించటం కష్టం అని బ్రిటిష్ వారు మన నడుమ చిచ్చుపెట్టి, విభజించి పాలించారు. ఇప్పుడు దేశంలో ఉన్న సమస్యలన్నీ వారు సృష్టించినవే అని విద్యార్థులకు బోధిస్తున్నాడు ఉపాధ్యాయుడు. ఆ సమాజంలో ఇదే వాదనను ప్రచారం చేశాయి ప్రభుత్వం, సినిమాలు కూడా. లేకపోతే మన నడుమ ఉన్న విద్వేషాలు మరింత తీవ్రమౌతాయి ఇది అంతర్యుద్ధానికి దారి తీస్తుంది. సమాజం విచ్ఛిన్నమైపోతుంది. దేశం ముక్కలవుతుంది. ఇప్పటి పరిస్థితి చూస్తే అప్పటి వారి ఆలోచనల లోతు అర్థమవుతుంది. దూరదృష్టి తెలుస్తుంది.

టీచర్ చెప్పిన జవాబు విని పిల్లలు ఇంకో ప్రశ్న వేస్తారు. ఇది కూడా అప్పటి సమాజంలోనే కాదు, ఇప్పటి సమాజంలోనూ రగులుతూన్న ప్రశ్ననే.

**కుఛ్ ఇన్సాన్ బ్రాహ్మణ్ క్యూ హై**

**కుఛ్ ఇన్సాన్ హరిజన్ క్యూ హై**

**ఏక్ కీ ఇత్‌నీ ఇజ్జత్ క్యూ హై**

**ఏక్ కీ ఇత్‌నీ జిల్లత్ క్యూ హై**

ఇది పిల్లల ప్రశ్న. కొందరు బాహ్మణులు, కొందరు హరిజనులు ఎందుకు? కొందరికేమో ఎంతో గౌరవం, మరి కొందరికి తీరని అవమానం ఎందుకు?

భారతీయ సమాజం తమని తాము నిర్మొహమాటంగా అడగాల్సిన ప్రశ్న. ప్రతి ఒక్కరి మనసు తొలిచే ప్రశ్న ఇది.

**ధన్ ఔర్ జ్ఞాన్‌కో**

**తాకత్ వాలోంనే అప్నీ జాగీర్ కహా**

**మెహనత్ ఔర్ గులామీ కమ్జోరోంకీ తక్ దీర్ కహా**

**ఇన్సానోంకీ యే బట్ వారా**

**వహశత్ ఔర్ జహాలాత్ హై**

**జో నఫ్రత్ కీ శిక్షా దే**

**వో ధర్మ్ నహీ హై లాలచ్ హై**

**జనమ్ సె కోయీ నీచ్ నహీ**

**జనమ్ సే కోయీ మహాన్**

**కరం సే బఢ్ కర్ కిసీ ఇన్సాన్‌కీ**

**కోయీ భీ పహచాన్ నహీ.**

కొందరు శక్తిమంతులు ధనాన్ని, జ్ఞానాన్ని తమ సొమ్ముగా భావించారు. కష్టపడటాన్ని, బానిసలా సేవచేయటాన్ని 'అదృష్టం' లేక 'తలరాత' అన్నారు. మనుషులను ఈ రకంగా విభజించటం మూర్ఖత్వం, పిచ్చి తనం. ఇలా మనుషులకు ద్వేషించటం నేర్పేది ధర్మం కాదు, అది శాపంలాంటిది. పుట్టుకతో ఎవ్వరూ నీచులు కారు. పుట్టుకతో ఎవ్వరూ గొప్పవారు కారు. కర్మనే మనిషికి గుర్తింపునిస్తుంది. మంచి పనులు చేస్తే మంచివాడు. దుర్మార్గపు పనులు చేస్తే దుష్టుడు. అంతే.

ఇదీ ఉపాధ్యాయుడిచ్చిన వివరణ. ఆ కాలంలో ఈ వివరణను ఆమోదించారు. కానీ ఈ కాలంలో ఇలాంటి వివరణను ఒప్పుకోరు. బ్రాహ్మణులు, హరిజనులలాంటి తేడాలు ఒక్క హిందూ ధర్మంలోనే ఉన్నాయా? ఇతర ఏ ధర్మాలలో లేవా? అని ప్రశ్నించి, ఇతర మతాలు ధర్మాలలోని భేదాలు, తేడాలు వివరిస్తారు. 'పుట్టుకతోటే బ్రాహ్మణుడు' అని ఏ శాస్త్రం చెప్పలేదని బ్రాహ్మణుడిని గుర్తించేందుకు శాస్త్రాలు చెప్పిన శ్లోకాలు చెప్పారు. అంతేకాదు, పద్ధతి ప్రకారం

బ్రాహ్మణులకు ఈ నేరభావన కలిగించేందుకు చేస్తున్న ప్రయత్నం అని వాదిస్తారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే, ఈ వాదనలో బలం కనిపిస్తుంది. ఎందుకంటే, ఎన్నడూ బ్రాహ్మణులు ధనవంతులు, శక్తివంతులు కాదు. వారు దానాలు పుచ్చుకున్నారు. రాజాశ్రయం పొందారు. నీతులు, నియమాలు ఏర్పరచింది బ్రాహ్మణులు కారు. కానీ అన్నిటికీ బ్రాహ్మణుడిపై నేరం నెట్టేయటం అలవాటయిపోయింది. అదీ ఎంతగా అంటే, విజ్ఞానం ఉట్టిపడాల్సిన విద్యార్థులు 'బ్రాహ్మణులు దేశం విడిచి పోవాలని' ఉద్యమించేంతగా! పైగా ఈ పాటలో, ఇలాంటి తేడాలు నేర్పే ధర్మం మానవత్వానికి శాపం అన్నాడు సాహిల్. ఆ కాలంలో ఆమోదించారు. ఈ కాలంలో కష్టం. కానీ, ఆనాటి పరిస్థితుల ప్రకారం సాహిర్ ఇచ్చిన వివరణ సర్వజనామోమైన వివరణ. కానీ ఒక పద్ధతి ప్రకారం భారతీయ సమాజం ఒక్కదాన్నే దోష భూయిష్టంగా చూపుతూ, అందులోని అన్ని అన్యాయాలకూ బ్రాహ్మణులనే దోషులుగా నిలుపుతూ రావటం వల్ల ఈనాడు సమాజంలో సౌభ్రాతృత్వ భావనలు అంతరించి ద్వేష భావనలు పెచ్చరిల్లుతున్నాయి. ఒకరికే పక్షపాతం చూపుతూ, మరొకరివైపు సవతితల్లి చూపు చూస్తున్నారన్న ఆక్రోషాలు పెరిగాయి.

**పండిట్ జీ మంతర్ ఫడ్‌తాహై, వో గంగాజీ నహలా తే హై**

**హం పేట్ క మంతర్ పఢ్ తే  హై, జూతే కా మూహ్ చంకాతేహై**

**పండిత్ కో పాంచ్ చవన్నీహై, హం కో ఏక్ చవాన్నీ హై**

**ఫిర్ భేద్ భావ్  యే యే కైసాహై . జబ్ సబ్ కా ప్యారా పైసా హై**

**ఊంచే నీచ్ కుఛ్ సమఝున పాయే**

**హమ్ మత్వాలే పాలిష్ వాలే.**

'బూట్ పాలిష్' సినిమాలో శైలేంద్ర రాసిన ఈ పాట సాహిర్ ఆలోచననే ప్రతిధ్వనిస్తుంది. ఇది ఆ కాలంలో అభ్యుదయ భావాల వామ పక్షాల భావన. సాహిర్, శైలేంద్ర ఇద్దరూ ఆ పార్టీవారే. పండితుడు మంత్రం చదువుతాడు. గంగానదిలో స్నానం చేయిస్తాడు. అతడికి అయిదు రూపాయలు. మేము ఆకలి మంత్రం చదువుతాం. బూట్ల ముఖాలను మెరిపింపచేస్తాం. మాకు దక్కేది  పదిపైసలు. అందరికీ పైసలే కావాల్సినప్పుడు ఎందుకూ భేదభావం? హెచ్చు తక్కువలు మాకు అర్థం కావు. బూట్ పాలిష్ వాళ్ళం మేము.

'మంత్రాలు నేర్చుకుని చదవటానికీ, బూట్ పాలిష్ చేయటానికీ తేడా తెలియక, రెంటినీ సమానంగా భావించి రాశాడా కవి?' అనిపిస్తుంది. కానీ ఆ కాలంలో చలామణీ అయినవి ఇలాంటి ఆలోచనలే.

**పిల్లల ప్రశ్న.**

**అబ్ తో దేశ్ మె ఆజాదీ హై**

**అబ్ క్యూ జనతా ఫర్యాద్ హై**

**కబ్ జాయెగా దౌర్ పురానా? కబ్ ఆయెగా నయా జమానా?**

పిల్లలకు టీచర్ సమాధానం ఇస్తూంటే హెడ్‌మాస్టర్ నుంచి పిలుపు వస్తుంది. పాట ఆపి వెళ్తాడు. బోధన పద్ధతి మార్చుకోమంటారు – మన హీరో మార్చుకోనని రాజీనామా చేసి వస్తాడు. పిల్లలకు సమాధానం పూర్తి చేస్తాడు.

**సదియోమ్కీ భూక్ ఔర్ బేకారీ**

**క్యా ఏక్ దిన్ మే జాయెగీ**

**ఇస్ ఉజ్ డే గుల్షన్ పర్ రంగత్ ఆతే ఆతే అయేగీ**

**యే జో నయే మన్సూబే హై**

**ఔర్ యే జో నయీ తామీర్ హై**

**అనే వాలీ దౌర్ కే కుఛ్**

**ధుంధులీ ధుంధులీ తస్వీర్ హై**

**తుం హీ రం భరోగే ఇన్మే**

**తుం హీ ఇన్‌హే చంకావోగే**

**నవయుగ్ అప్నీ ఆప్ నహీ ఆయేంగే**

**నవయుగ్ కో తుం లావోగే..**

పిల్లలు ప్రశ్న అడిగారు. ఇప్పుడు దేశం స్వతంత్రమయింది. అయినా ఇంకా ప్రజల కష్టాలు తీరలేదేమిటి? పాత ప్రపంచం పోయి, ఎప్పుడు కొత్త యుగం ఆరంభమవుతుంది?

ఈ ప్రశ్నలకు సమాధానం ఇస్తాడు.

కొన్ని వేల ఏళ్లనుంచీ ఉన్న సమస్యలు ఒక్క రోజులో పరిష్కారమవుతాయా? అతి దయనీయ స్థితిలో ఉన్న తోట (దేశం) మళ్ళీ పుష్పించేందుకు సమయం పడుతుంది. కొత్త ఆలోచనలు, విజయం సాధించాలన్న దీక్ష ప్రస్తుతం సమాజంలో కనిపిస్తున్నది. భవిష్యత్తులో దేశం ఎలా ఎదుగుతుందో ఊహించే వీలునిస్తున్నాయీ కోరికలు. అయితే దేశాభివృద్ధి తనంతట తాను సంభవించదు. ఇంకా అస్పష్టంగా ఉన్న అభివృద్ధి చిత్రాన్ని పూర్తి చేయవలసింది మీరే. దేశాన్ని అభివృద్ధి చేయాల్సింది మీరే. నవయుగం తేవలసింది మీరే. మీరే తెస్తారు.

ఇదీ సాహిర్ రచించిన సినిమా పాట. సాహిర్ పాటలలో సాహిర్ తప్ప మరెవరూ కనబడరు. అందుకే తన పాటలతో సినిమాలను హిట్ చేయించగల ఏకైక గేయ రచయత ఆనాటికీ ఈనాటికీ సాహిర్ లూధియాన్వీ.

ఆకాలంలో భవిష్యత్తులో భారత్ భూతల స్వర్గంగా ఎదుగుతుందనీ, భవిష్యత్తు తరాలపై గురుతర బాధ్యతను తెలిసే పాటలు ఎన్నో వచ్చాయి. ఈ సినిమాలోనే చివరలో ఓ పాట ఉంది. సాహిర్ అద్భుతంగా రాశాడా పాటను.

**బచ్చోం తుం తక్ దీర్ హో కల్ కీ హిందుస్తాన్‌కీ**

**బాపూ కే వరదాన్ కీ నెహ్రూకే అర్మాన్ కీ .**

**హిందుస్తాన్ భవిష్యత్తు మీరే పిల్లలూ .మీరే బాపూ కలలు, నెహ్రూ కోరికలు తీర్చేవారు.**

**దీన్ ధర్మ్ కే నామ్ పర్ కోయీ బీజ్ ఫూట్ కా బోయే నా**

**జో సదియోం కి బాద్ మిలీ హై వో అజాదీ ఖోయే నా**

**హర్ మజహబ్ సే ఉంఛీ హై కీమత్ ఇన్సానీ జాన్‌కీ.**

మతం పేరిట ప్రజల మధ్య విద్వేషాల బీజాలు నాటవద్దు. ఎన్నో ఏళ్ల తరువాత లభించిన స్వతంత్రం కోల్పోవద్దు. అన్ని మతాల కన్నా విలువైంది మానవ ప్రాణం.

భవిష్యత్తు ఇలా అవకూడదని ఆనాటి కవులు తపన పడ్డారు. ఈనాడు కవులు కులం, మతం, ప్రాంతం, భాష, మైనారిటీ వంటి పలు సంకుచిత అంశాలను పట్టుకుని వ్రేళ్లాడుతూ సంకుచితత్వమే పరమోత్తమం అంటున్నట్టు ప్రవర్తిస్తున్నారు.

ఫిర్ కోయీ జయ్ చంద్‌న ఉభ్రే. ఫిర్ కోయీ జాఫర్ న ఉఠే

గైరోంకా దిల్ ఖుష్ కర్‌నే కె అప్నోం పర్ ఖంజర్ న ఉఠే

ధన్ దౌలత్ కే లాలచ్ మే తౌహీన న హో ఈమాన్ కీ

మళ్లీ దేశ ద్రోహులు తల ఎత్తకూడదు. పరాయివారిని సంతృప్తి పరిచేందుకు తమవారిని వెన్నుపోటు పొడవద్దు. ఐశ్వర్యం ఆశలో మానవత్వాన్ని సంహరించకూడదు.

కానీ ఇప్పుడు మనకు శత్రువులకన్నా మనవారినుంచే అధిక ప్రమాదం పొంచి ఉంది. మనవారిని ఎంత కించపరిస్తే మనం అంత గొప్ప... పరాయి వాడికి మనమంటే అంత ఇష్టం అవుతాము.

ఇలాంటి పాటలకు ఇప్పటి సినిమాల్లో స్థానం లేదు. ఇప్పటి సినిమాలలో ఆదర్శం, సమాజం, భవిష్యత్తు అన్న ఆలోచనలు కనబడటంలేదు. స్టార్లు, సూపర్ స్టార్లు, స్టార్లకి స్టార్లు తప్ప మనుషులు, మానవ జీవితం, ఆవేదనలు, సంవేదనలు అదృశ్యం అయిపోయాయి. ఇలాంటి సందర్భాలలో సాహిర్ రాసిన ఈ పాటల ప్రాధాన్యం తెలుస్తుంది. అప్పటి సినిమాలలో టీచర్లను ఏడ్పించి, యువతులను ప్రేమించి హీరోయిజం ప్రదర్శించేందుకే కాలేజీకి వెళ్తారు. సమాజం అలానే ఎదుగుతోంది. ఎందుకంటే వారికి ఉత్తమ ఆలోచన, ఉన్నతమైన ఆదర్శం గురించి స్పృహ కలిగిచటంలో సమాజం విఫలమవుతోంది. ఇలాంటప్పుడే ఇలాంటి పాటలు, సినిమాలు సాంత్వననిస్తాయి. వీటి పరిచయం ద్వారా ఏ ఒక్కరిలో మార్పు వచ్చినా ఆనాటి కళాకారుల శ్రమ ఫలించినట్టే.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story